శివరాత్రికి శివాలయాలు ముస్తాబు



ముస్తాబైన మీరాలంమండి
శ్రీ మహంకాళేశ్వర ఆలయం



మహంకాళేశ్వర ఆలయంలో
కొలువుదీరిన శివలింగం



మహాదేవ్ మందిర ప్రధాన ద్వారం

- ఆకర్షణీయంగా మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయం
- అన్ని ఏర్పాటు చేస్తున్న ఆలయ నిర్వాహకులు
- కనుల పండువగా జరుగనున్న శివపార్వతుల కల్యాణోత్సవాలు

చార్మినార్: పాతబస్తీలోని శివాలయాలు మహా శివరాత్రి వేడుకలకు ముస్తాబవుతున్నాయి. చార్మినార్, యాకుత్‌పురా, చాంద్రాయణగుట్ట, బహదూర్‌పురా తదితర శాసన సభ నియోజక వర్గాల్లోని పలు ప్రాంతాల్లో ఉన్న పురాతన శివాలయాలను సంబంధిత ఉత్సవాల నిర్వాహకులు భక్తులకు సౌకర్యవంతంగా తీర్చిదిద్దుతున్నారు. ఇప్పటికే కొన్ని ఆలయాల్లో తగిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాత్రంగా జాగరణ చేయడం కోసం కూడా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.

మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో..

నిజాం కాలం నుంచి మీరాలంమండిలో భక్తులు శివునికి పూజలు నిర్వహిస్తున్నారు. ఈసారి మహంకాళేశ్వర ఆలయంలో మహా శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు చేశారు. ఈనెల 8న ఉదయం 4 గంటలకు నిర్వహించే గణపతి పూజతో మహా శివరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు.

చార్మినార్‌లో 1857 నాటి మహాదేవ్ మందిరంలో..

చార్మినార్ సమీపంలోని మహాదేవ్ మందిరంలో ఈసారి మహాశివరాత్రి వేడుకలు కనుల పండువగా నిర్వహించడానికి మందిరం నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 8న నిర్వహించే ఉత్సవాల్లో పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఉత్సవాల నిర్వాహకులు తెలిపారు.

స్పటిక శివలింగానికి పూజలు..

1857 నాటి ఈ మందిరాన్ని 2016లో సరాఫా అండ్ జువెల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధుల సహకారంతో పునఃనిర్మించారు. భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాల నడుమ విశాలంగా ఈ శివ మందిరాన్ని పునఃనిర్మించారు. మందిరంలో గుజరాత్ నుంచి తెప్పించిన స్పటిక శివలింగాన్ని ప్రతిష్ఠించారు. ద్వితీయ జ్యోతిర్లింగమైన శ్రీశైలం మల్లికార్జున స్వామి లింగ స్పర్శ అనంతరం అఖండ జ్యోతితో ఈ స్పటిక శివలింగాన్ని 2016 మందిరానికి తరలించి వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ ప్రాణప్రతిష్ఠ చేశారు. పాతబస్తీని సందర్శించడానికి వస్తున్న కొంత మంది పర్యాటకులు సైతం మహాదేవీ మందిరాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారని ఉత్సవాల నిర్వాహకులు అజయ్ కుమార్ అగర్వాల్ తెలిపారు.

పురానాపూల్ శ్రీ సురాభాండేశ్వర గౌండ్ల మఠంలో..



కొలువుదీరిన
శ్రీ సురాభాండేశ్వరుడు



శ్రీ సురాభాండేశ్వర గౌండ్ల మఠం

జియాగూడ: పురానాపూల్ రహింపురాలోని సురాభాండేశ్వర గౌండ్ల మఠంలో ఈ నెల 8న మహా శివరాత్రి వేడుకలను భారీ ఎత్తున నిర్వహిస్తున్నట్లు ఆలయ ముఖ్య సలహాదారులు నిర్మల నీలకంఠం గౌడ్, బుర్రా భాస్కర్‌గౌడ్, గోదా వెంకటేష్‌గౌడ్, ధర్మకర్తల పాలకమండలి అధ్యక్షుడు గౌడిశాల నరేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి కొత్త నవీన్‌కుమార్ గౌడ్, ఉపాధ్యక్షులు గడ్డమీది యజ్ఞేశ్వర్ గౌడ్ కోశాధికారి నిర్మల మనుజేందర్ గౌడ్, ఉపాధ్యక్షులు పోతగాని ఐలేష్‌గౌడ్, కార్యనిర్వాహక కార్యదర్శి పంజాల అశోక్‌కుమార్ గౌడ్ తెలిపారు. ఈ మేరకు ఆలయంలో బ్రోచర్‌ను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..ఆలయంలో మహా శివరాత్రి రోజున తెల్లవారుజాము నుంచే రుద్రాభిషేకం, అభిషేకం, అఖండ హారతి, సర్వ దర్శనం, సాయంత్రం బ్రమరాంబ మల్లికార్జునుల కల్యాణ మహోత్సవం, 9న మహా అన్నదాన కార్యక్రమాన్ని భారీ ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహా శివరాత్రి రోజున బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, ఎమ్మెల్సీ బి.మహేష్‌కుమార్ గౌడ్, మాజీ లోక్‌సభ సభ్యులు మధుయాష్కీగౌడ్, రాష్ట్ర సద్భావన అవార్డు గ్రహీత ముద్దగౌని అరవింద్ కుమార్ గౌడ్, టి.పద్మారావుగౌడ్, ప్రకాష్ గౌడ్, రాజాసింగ్, విజయకుమార్ గౌడ్, స్వామిగౌడ్, రవీందర్ గౌడ్, బాలగోని బాల్‌రాజ్ గౌడ్, నోముల అశోక్‌కుమార్ గౌడ్ తదితరులు హాజరవుతున్నారన్నారు.

గవర్నర్ తమిళిసైకి ఆహ్వానం



ఆహ్వాన పత్రాన్ని అందజేస్తున్న టీటీడీ
లోకల్‌బాడీ వైస్ చైర్మన్ మెట్టు రాఘవేంద్ర

అబిడ్స్: జూబ్లీహిల్స్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 7వ తేదీ నుంచి జరిగే బ్రహ్మోత్సవాలకు రావాలని గవర్నర్ తమిళిసై సౌందర రాజన్‌కు టీటీడీ లోకల్‌బాడీ వైస్ చైర్మన్ మెట్టు రాఘవేంద్ర విజ్ఞప్తి చేశారు. 7వ తేదీ నుంచి 17వ తేదీ వరకు పెద్ద ఎత్తున జరిగే బ్రహ్మోత్సవాలకు రావాలని ఆమెకు ఆహ్వానం అందజేశారు. ఈ సందర్భంగా మెట్టు రాఘవేంద్ర మాట్లాడుతూ..బ్రహ్మోత్సవాల వేడుకలు కనుల పండువగా నిర్వహిస్తామన్నారు. 17వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాలకు నగరవాసుకే కాక తెలంగాణ నుంచి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేస్తారని పేర్కొన్నారు.

సదరన్ క్యాంపునకు స్పందన



గోల్కొండ: సదరన్ క్యాంపునకు వచ్చే వారు ముందుగా తమ పేర్లను ఆన్‌లైన్ నమోదు చేసుకోవాలని గోల్కండ ఏరియా ఆసుపత్రి ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ క్రాంతి అన్నారు. మంగళవారం ఆసుప్రతిలో సదరన్ క్యాంపు జరిగింది. ఆన్‌లైన్‌లో పేరు నమోదు చేసుకోని వారికి ఎటువంటి వైద్య పరీక్షలు నిర్వహించామని ఆయన స్పష్టం చేశారు. వయసుతో సంబంధం లేకుండా ప్రభుత్వం దివ్యాంగులకు నిర్దేశించిన పింఛన్ పొందలాంటే తాము నిబంధన ప్రకారమే పరీక్షలు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ సదరన్ క్యాంపులో మొత్తం 71 మందికి వైద్య పరీక్షలు నిర్వహించామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజహర్‌ఉల్లా తెలిపారు. వీరిలో 45 మందికి ఆర్థోపెడిక్ పరీక్షలు, 26 మందికి జనరల్ ఫిజిషియేన్ వైద్య పరీక్షలు నిర్వహించామని ఆయన తెలిపారు. డాక్టర్ అమీనా, డాక్టర్ ప్రభావతిలు ఈ సదరన్ క్యాంపులో పాల్గొన్నారు.

గోల్కొండ ఆసుపత్రిలో కార్పొరేట్ వైద్య సేవలు



వైద్యులతో సమావేశమైన
డాక్టర్ మహ్మద్ మజహర్ ఉల్లా

గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో అన్ని విభాగాల వైద్యులు ఉన్నారని ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజహర్‌ఉల్లా అన్నారు. మంగళవారం వివిధ విభాగాల వైద్యులతో ఆయన సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ ఆసుపత్రి కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా వైద్య సేవలందిస్తుందన్నారు. ఈఎన్‌టీ విభాగంతో పాటు డెంటల్ విభాగంలో కూడా అనుభవజ్ఞులైన వైద్యులు ఉన్నారన్నారు. ఆసుపత్రిలో ఉన్న ఐసీయూ విభాగంలో అన్ని రకాల వైద్య సేవలు, పరికరాలు ఉన్నాయని పేర్కొన్నారు. కంటి విభాగం కూడా వైద్యులు ఉన్నారని ఆయన తెలిపారు. ఫిజిషియేన్‌లతో పాటు గైనకాలజిస్టు సేవాలు కూడా అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు. ఆసుపత్రి అభివృద్ధికి ఎమ్మెల్యే కౌసర్ కృషి చేస్తున్నారన్నారు. ప్రస్తుతం ఆసుపత్రిలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఆర్‌ఎంవో డాక్టర్ వినయాక్‌రావు, ఏవో డాక్టర్ శ్రీనివాస్‌రావు, క్రిటికల్ కేర్ ఎమర్జెన్సీ డాక్టర్ అమీనా, పెథలాజిస్ట్ డాక్టర్ జబీన్, డెర్మటాలజిస్ట్ డాక్టర్ సుహాసిని, పిడియాట్రిక్ విభాగం డాక్టర్ మల్లికార్జున్, ఈఎన్‌టీ విభాగం డాక్టర్ రమ్య తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

అఫ్జల్‌గంజ్: 11 కేవీ పురాణాపూల్ ఓవర్‌హెడ్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని జుమ్మేరాత్ బజార్, ఎంసీహెచ్ కార్యాలయం, భూలక్ష్మి ఆలయం తదితర ప్రాంతాల్లో బుధవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు ఓ ప్రకటన ద్వారా తెలిపారు. అలాగే 11 కేవీ పురాణాపూల్ అండర్‌గ్రౌండ్స్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని జుమ్మేరాత్ బజార్, ఓం శ్‌వాడి, జించిచౌరా తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 2 గంటల వరకు. 11 కేవీ గ్యాన్‌బాగ్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని గ్యాన్‌బాగ్ కాలనీ కమ్యూనిటీహాల్, పోలీస్ క్వార్టర్స్, గ్యాన్‌బాగ్ కాలనీ డబుల్ డెబ్‌రూం తదతర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3.30 నుంచి 4.30 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు.

10న వరల్డ్ గ్లకోమా డే

గోల్కొండ: ఈ నెల 10న వరల్డ్ గ్లకోమా డే నిర్వహిస్తున్నామని మెహిదీపట్నంలోని సరోజినీదేవి కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.రాజలింగం తెలిపారు. ఇందులో భాగంగా మార్చి 10 నుంచి 16వ తేదీ వరకు గ్లకోమా వీక్ నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ఆరోగ్య మంత్రి దామోదర రాజనర్సింహ్మ ఈనెల 10న జరిగే వరల్డ్ గ్లకోమా అవెర్‌నెస్ వాక్‌లో పాల్గొంటారని ఆయన అన్నారు.

బాధ్యతల స్వీకరణ



శ్రీనివాసచారి

సుల్తాన్‌బజార్: సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా సోమారపు శ్రీనివాసచారి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆయన గతంలో మహబూబ్‌నగర్, కోస్గి, షాద్‌నగర్, వనపర్తిలలో విధులు నిర్వహించానన్నారు. సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలకు ఎవరైన విఘాతం కలిగిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జీహెచ్ఎంసీ అధికారులపై మంత్రికి ఫిర్యాదు



మంత్రికి ఫిర్యాదు చేస్తున్న
ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలో జీహెచ్ఎంసీ ఎస్టేట్ అధికారులు అవినీతికి పాల్పడుతూ జీహెచ్ఎంసీ దుకాణాలను అక్రమార్గంలో అలాట్‌మెంట్ చేస్తున్నారని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. మంగళవారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి పూర్తి వివరణలతో కూడిన మెమోరాండం అందజేశారు. జీహెచ్ఎంసీ ఎస్టేట్ అధికారి భాషా, ఇతర అధికారులు కుమ్మక్కై పలు ప్రాంతాల్లో షాపులను నిబంధనలకు విరుద్ధంగా అలాట్ చేశారన్నారు. గౌలిగూడలో కొన్ని షాపులకు రూ.50 వేల కిరాయి, మరికొన్నిటికి రూ.9 లకే కిరాయికి ఇచ్చారన్నారు. కోఠిలోని కొన్ని షాపులను అందులో ఉన్నవారికి తక్కువ ధరలకే కట్టబెట్టారని ఆరోపించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. అవినీతికి పాల్పడే అధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.

మేరు కులస్తులకు ఎంపీ టికెట్లు కేటాయించాలి



గాంధీభవన్‌కు తరలివచ్చిన
పోల్కం శ్రీనివాస్, మేరు కులస్తులు

అబిడ్స్: మేరు కులస్తులకు కాంగ్రెస్ పార్టీ ఎంపీ టికెట్లు కేటాయించాలని మేరు కులస్తులు భారీ ర్యాలీ నిర్వహించారు. మంగళవారం రాష్ట్ర ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పోల్కం శ్రీనివాస్, రాష్ట్ర మేరు యువజన సంఘం ప్రధాన కార్యదర్శి ఆదిమూలం శంకర్, ఇతర రాష్ట్ర నాయకులు గంగాపురం దశరథ్, గోపాల్‌రెడ్డి, పోల్కం వినయ్‌రాజ్, కొండూరు చంద్రశేఖర్, కీర్తి జయంత్, మునగాల రమేష్, మెన్ను శివకుమార్‌తో పాటు వందలాది మంది నాయకులు గాంధీభవన్‌లో పార్టీ ఉపాధ్యక్షులు మల్లు రవిని కలిసి వినతిపత్రం అందజేశారు. మల్కాజిగిరి పార్లమెంట్ టికెట్‌ను పోల్కం శ్రీనివాస్‌కు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. 30 ఏళ్లకు పైగా కాంగ్రెస్ పార్టీలో ఉన్న సీనియర్ నాయకుడు పోల్కం శ్రీనివాస్‌కు టికెట్ ఇస్తే భారీ మెజార్టీతో గెలిపిస్తామని వారన్నారు. ఈ సందర్భంగా మల్లు రవి సానుకూలంగా స్పందించారు. మేరు కులస్తుల సమస్యలను, మల్కాజిగిరి కాంగ్రెస్ టికెట్‌పై పార్టీ అధిష్టానంతో చర్చిస్తామని హామీ ఇచ్చారు.

సన్మానం



కార్పొరేటర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: సమాజ సేవకు యువకులు నడుంబిగించాలని నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్ అన్నారు. తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్ మంగళవారం ఆయనను టోలిచౌకీలోని తన కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 12 ఏళ్లుగా మహ్మద్ నజీబ్ తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ నిర్వహిస్తూ ఎన్నో కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న కాపురాలను విడిపోకుండా కాపాడారన్నారు. మరోవైపు ఆర్గనైజేషన్ తరపున కరోనా విజృంభించిన కాలంలో ఆసుపత్రులు, రైల్వే స్టేషన్‌ల వద్ద ఉన్న నిరుపేదలకు నిత్య అన్నదానం చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఖాలేద్ ఆలీఖాన్, మహ్మద్ తదితరులున్నారు.

సర్పంచుల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి



మాట్లాడుతున్న యాదయ్య గౌడ్ తదితరులు

సుల్తాన్‌బజార్: తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.1500 కోట్ల సర్పంచులకు చెల్లించే బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ మంగళవారం ప్రజావాణిలో ప్లానింగ్ కమిటీ వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్యవాణిని కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్, ప్రధాన కార్యదర్శి కొలను శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. హైదర్‌గూడలోని ఎన్‌ఎస్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ..వెంటనే నిధులు విడుదల చేయకపోతే పార్లమెంట్ ఎన్నికల్లో గ్రామాల్లోకి వచ్చిన ప్రజా ప్రతినిధులు విడుదల చేయకపోతే, ఆ తదుపరి రాష్ట్రంలో ఉన్న ప్రతిపక్ష పార్టీలను కలుపుకొని, భవిష్యత్ కార్యాచరణ తెలియజేస్తామన్నారు. గత ప్రతిపక్ష హోదాలో రేవంత్‌రెడ్డి, సీతక్క, భట్టి విక్రమార్కలు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే సర్పంచుల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి హామీ ఇచ్చారని గుర్తుచేశారు. లేని యెడలా వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి పార్లమెంట్ పరిధిలో సర్పంచులం అందరం పార్లమెంట్ అభ్యర్థులుగా నామినేషన్ వేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నారబోయిన రాజారాం, చంద్రమౌళి, మధుసూదన్‌రెడ్డి, లాలయ్య, సుభాష్, రత్నాకర్‌రావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురు మహిళల చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న రవిరాజ్, శ్రీనివాస్

గౌలిపురా: కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు యాకుత్‌పురా నియోజకవర్గం ఇన్‌చార్జి కె.రవిరాజ్ అన్నారు. మంగళవారం యాకుత్‌పురా నియోజకవర్గం గౌలిపురా డివిజన్ హనుమాన్‌నగర్ ఫేజ్–3లో పలువురు బీజేపీ, బీఆర్ఎస్ డ్వాక్రా మహిళా నాయకురాలు ధనలక్ష్మీ వారి బృందం యాకుత్‌పురా ఏ-బ్లాక్ అధ్యక్షుడు మామిడాల శ్రీనివాస్, రవిరాజ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మహిళా నాయకురాళ్లకు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీపీసీసీ సెక్రటరీలు ఆల్లం భాస్కర్, మామిడి కృష్ణ కుమార్, కోట్ల లడ్డూ యాదవ్, డల్లు శివ, చిన్న, లడ్డూ గౌడ్ పాల్గొన్నారు.

అబిడ్స్ ఇన్‌స్పెక్టర్‌గా రాజగోపాల్‌రెడ్డి



అబిడ్స్: అబిడ్స్ పోలీస్‌స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా జి.రాజగోపాల్‌రెడ్డి పదవీబాధ్యతలు స్వీకరించారు. గత కొన్ని నెలలుగా పనిచేసిన నర్సింహారాజు ఎన్నికల బదిలీల్లో భాగంగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సైబరాబాద్ నుంచి రాజ్‌గోపాల్ రెడ్డిని నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక కృషి చేస్తానన్నారు. స్థానిక ప్రజల సహకారంతో ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు.

భక్తిశ్రద్ధలతో హోమం



చాంద్రాయణగుట్ట: కేశవగిరి చెన్నకేశవ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం హోమం నిర్వహించారు. ఉదయం సుదర్శన నారసింహ హవనం, పారాయణం, చతుస్థానార్చన కార్యక్రమాలు కొనసాగాయి. శ్రీకాంత్ పూజారీ పర్యవేక్షణలో జరిగిన ఈ హోమంలో అర్చన దంపతులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ జుర్కీ సంతోషి రాణి ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు.

అబిడ్స్ సోని ఎలక్ట్రానిక్స్ వద్ద ఉద్రిక్తత



ఫ్రిజ్‌ను జీహెచ్ఎంసీ కార్యాలయానికి
తరలిస్తున్న సిబ్బంది

- ఆస్తిపన్ను చెల్లించని సోని ఎలక్ట్రానిక్స్
- ఐదు ఫ్రిజ్‌లు, కంప్యూటర్ స్వాధీనం

అబిడ్స్: అబిడ్స్ సోని ఎలక్ట్రానిక్స్ ముందు ఉద్రిక్తత చోటు చేసుకుంది. కొన్ని సంవత్సరాలుగా సోని ఎలక్ట్రానిక్స్ యాజమాన్యం జీహెచ్ఎంసీ 14వ సర్కిల్‌కు ఆస్తిపన్ను చెల్లించడం లేదు. దీంతో రూ.58 లక్షలు ఆస్తిపన్ను బకాయి పడింది. గతంలో ఆస్తిపన్ను వెంటనే చెల్లించాలని, లేనిచో చర్యలు తీసుకుంటామంటూ జీహెచ్ఎంసీ 14వ సర్కిల్ అధికారులు వారెంటీ కూడా జారీ చేశారు. అయినా ఫలితం లేకపోవడంతో మంగళవారం జీహెచ్ఎంసీ 14వ సర్కిల్ ఏఎంసీ శైలజ, టీఐ కైలాష్ సింగ్, బీసీ ఓంప్రకాష్ వారెంట్ జారీ చేశారు. ఆస్తిపన్ను చెల్లించనిచో సామగ్రిని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించగా నిర్వాహకులు అడ్డుకున్నారు. దీంతో జీహెచ్ఎంసీ అధికారులు అబిడ్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల సహకారంతో సిబ్బంది 5 ఫ్రిజ్‌లను, ఒక బిల్ కంప్యూటర్‌ను స్వాధీనపరచుకుని అబిడ్స్ మున్సిపల్ కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా ఏఎంసీ శైలజ మాట్లాడుతూ..డిస్‌ట్రెస్ వారెంట్ జారీ చేసి ఆస్తులను సీజ్ చేసుకుంటామన్నారు. ఓటీఎస్ పద్ధతిలో రూ.43 లక్షలు ఆస్తిపన్ను చెల్లించాలని యాజమాన్యం చెల్లించకపోవడంతోనే వారి సామగ్రిని జప్తు చేస్తున్నామన్నారు.



పుట్టిన రోజు సందర్భంగా నాంపల్లి మెట్రోపాలిటన్ క్రిమినల్ కోర్టు బార్ అసోసియేషన్ వద్ద కేక్ కట్ చేసి, స్పోర్ట్స్ కిట్ పంపిణీ చేస్తున్న తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యుడు జి.జితేందర్‌రెడ్డి.
– సాక్షి, సిటీబ్యూరో

సమాజ సంక్షేమమే లక్ష్యం



అవార్డులు అందుకుంటున్న అధ్యాపక బృందం

గోల్కొండ: సమాజ సంక్షేమమే లక్ష్యంగా తమ కళాశాల ముందుకు సాగుతోందని షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ జి.రాఘవరెడ్డి అన్నారు. కళాశాలలో అత్యుత్తమ ల్యాబ్‌లు, పరిశోధన పరికరాలు ఉన్నందుకు కృత్రిమ మేధస్సు, వైద్య, ఇంజినీరింగ్ పరిశోధన సంఘం వారు కళాశాలకు అత్యుత్తమ అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత మూడు దశాబ్దాలుగా ఉత్తమ విద్యాబోధన, పరిశోధన ల్యాబ్‌లతో వేలాది మంది విద్యార్థినులను దేశానికి అందించామన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సీతకు లైఫ్ టైమ్ అచిమెంట్ అవార్డు, డాక్టర్ ఏ.శారదకు మాస్టర్ టీచర్ అవార్డు ఇన్నోవేషన్, ఇంక్యూబేషన్ విభాగం డీన్ ఎన్.కల్యాణికి మాస్టర్ టీచర్ అవార్డు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జయశ్రీ ఎస్ పాటిల్‌కు స్టూడెంట్ మెంబర్‌షిప్ అండ్ డెవలప్‌మెంట్ అవార్డు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వై.శ్రావణిదేవికి రైజింగ్ స్టార్ ఎడ్యూకేటర్ అవార్డు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జీఎన్‌టీఐఎస్ వైస్ చైర్‌పర్సన్ జి.శ్రీవవిద్యరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రాఘవరెడ్డి, ఆర్‌అండ్‌డి విభాగం డీన్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.సీత తదితరులున్నారు.

ఉప్పుగూడలో అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం



ప్రారంభోత్సవంలో మంత్రి పొన్నం ప్రభాకర్



ముఖ్యమంత్రి ఫొటో లేకుండానే
ముద్రించిన బ్యానర్

- వేదికపై బ్యానర్‌లో ముఖ్యమంత్రి ఫొటో లేకపోవడంపై కాంగ్రెస్ ఫిర్యాదు
- గజిబిజి గందరగోళం నడుమ కొనసాగిన కార్యక్రమం

చాంద్రాయణగుట్ట: ఉప్పుగూడ డివిజన్ అరుంధతి కాలనీలో నూతనంగా నిర్మించిన భవనంలో ఏర్పాటు చేసిన అంగన్ వాడీ కేంద్రాన్ని మంగళవారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, మజ్లిస్ శాసనసభ పక్షనేత, చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీతో కలిసి ఈ ప్రారంభోత్సవం చేశారు. రూ.15 లక్షల వ్యయంతో కూడిన ఈ భవనానికి జీహెచ్ఎంసీ రూ.7.5 లక్షల నిధులు వెచ్చించగా, మరో రూ.7.5 లక్షలను స్వచ్ఛంద సంస్థ సమకూర్చింది. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురుశెట్టి, ఆర్డీవో సూర్యప్రకాష్, జోనల్ కమిషనర్ వెంకన్న, సీడీపీవో జ్యోత్స్న, ఉప్పుగూడ కార్పొరేటర్ ఫహద్‌బిన్ అబ్దాద్, చాంద్రాయణగుట్ట కాంగ్రెస్ ఇన్‌చార్జి బోయ నరేష్, సీనియర్ నాయకులు వెంకటేష్ ముదిరాజ్, పర్వతాల రాజేందర్, కె.వెంకటేష్, కాశమోని శ్యాంరావు ముదిరాజ్, ప్రమోద్ రెడ్డి, గణేష్ రాథోడ్, రుక్మిణీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గందరగోళం నడుమ..

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక తొలిసారిగా చాంద్రాయణగుట్టలో మంత్రి పర్యటన నేపథ్యంలో పార్టీ శ్రేణుల నడుమ ఐక్యత లోపించినట్లు కనిపించింది. పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి అందరిని కలుపుకుపోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి ఛత్రినాక మీదుగా అరుంధతి కాలనీకి వస్తారని భావించి అందరూ ఉప్పుగూడ ఆర్‌యూబీ వద్ద ఎదురు చూశారు. కాని మంత్రి మాత్రం రక్షాపురం మీదుగా వచ్చి అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించారు. చివరకు ఆఘమేఘాల మీద పార్టీ నాయకులు కార్యక్రమ స్థలికి చేరుకున్నప్పటికీ పోలీసులు వారిని అనుమతించకపోవడంతో తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు.

సీఎం ఫొటో లేకుండానే బ్యానర్.. నిలదీసిన కాంగ్రెస్ శ్రేణులు..

కార్యక్రమం వేదిక వద్ద ఏర్పాటు చేసిన బ్యానర్‌పై ముఖ్యమంత్రి ఫొటో లేకపోవడాన్ని గమనించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై అక్కడే ఉన్న కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ ఘటనకు బాధ్యులైన ఐసీడీఎస్ అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్టీ నాయకుడు ప్రమోద్‌రెడ్డి సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు సైతం చేశాడు.

వ్యక్తి ఆత్మహత్య

విజయనగర్‌కాలనీ: మానసిక వేదన, అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మహ్మద్ అంజద్ షరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం..శుభకార్యాల్లో వంటలు చేసుకుని జీవించే మహ్మద్ అబ్దుల్ రహీమ్(30) తన కుటుంబసభ్యులతో కలిసి టప్పాచబుత్ర పరిధిలోని యూసుఫ్‌నగర్‌లో నివసిస్తున్నాడు. ఇటీవల మానసిక వేదన తీవ్రం కావడంతో సోమవారం అర్ధరాత్రి తన గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. అపస్మారక స్థితిలోకి చేరుకున్న అతడిని గమనించిన కుటుంబసభ్యులు వైద్య చికిత్సల నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతడు మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మైనారిటీల విద్యా పథకాలను పునరుద్ధరించాలి



చార్మినార్: మైనారిటీల కోసం అమలవుతున్న విద్యా పథకాలను కేంద్రం నిలిపి వేయడం సరైంది కాదని ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. 2024–పార్లమెంట్ ఎన్నికల్లో రాజకీయ పార్టీలు విద్యార్థుల విద్యా సంబంధిత అంశాలతో కూడిన స్టూడెంట్స్ మేనిఫెస్టోను ఎస్ఐవో విడుదల చేసింది. అనంతరం ఛత్తాబజార్‌లోని సంస్థ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ప్రెస్ కాన్ఫరెన్సులో ప్రొ. కోదండరామ్ మాట్లాడారు. ఎస్ఐవో మేనిఫెస్టోలో చేసిన సూచనలను ప్రభుత్వం పరిశీలించాలన్నారు. విద్యార్థుల ఆవేదనను అర్థం చేసుకొని వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఎస్ఐవో జాతీయ కార్యదర్శి అబ్దుల్లాహ్ ఫైజ్, ఫరాజ్, జమాఅతె ఇస్లామీహింద్ తెలంగాణ ఉపాధ్యక్షులు ముహమ్మద్ అజహరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.